ప్రజాశక్తి
ఆదివారం 22 డిసెంబరు, 2024 5
శ్రీకాకుళం



ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి- పాతపట్నం

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవ సెక్రెటరీ, సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, ఫ్యామిలీ కోర్టు మూడో అడిషనల్ జిల్లా జడ్జి సిహెచ్.వివేకనంద శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా పాతపట్నం సబ్ జైలును శనివారం సందర్శించారు. సబ్‌జైల్లో ఉన్న 16 మంది ఖైదీలతో నేరుగా మాట్లాడి సత్ప్రవర్తనతో మెలగాలని, ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. జైలు లోని పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య విషయంపై జాగ్రత్తగా ఉండాలన్నారు. చిన్న చిన్న తప్పులు చేసి జైలుకు వచ్చారని, వాటిని మరలా పునరావృతం కాకుండా చూసుకొని కుటుంబ సభ్యులతో మంచిగా జీవించాలని తెలిపారు. న్యాయపరమైన విషయంలో ఖైదీలకు న్యాయవాదులను పెట్టుకోలేని స్తోమత ఉన్నవారికి కోర్టు వారు సహాయం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రాము, సిబ్బంది రవి పాల్గొన్నారు.

గండం గట్టెక్కినట్టే!

- బలహీనపడిన వాయుగుండం
- జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షాలు
- వరి, మినప, పెసర పంట పొలాల్లో వర్షపు నీరు చేరిక



బూర్జ : వై.పర్తలో నీటమునిగి అపరాల పంట

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

బంగాళాఖాతం ఏర్పడిన వాయుగుండ ప్రభావంతో జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు కురిసాయి. శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం పడుతూనే ఉంది. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత తెరిపిచ్చింది. వర్షాల ప్రభావంతో వేలాది ఎకరాల్లో వరి పంట మునిగింది. కొన్నిచోట్ల పంట నేలకొరిగింది. పెసర, మినప పంటలకూ వర్షపు నీరు చేరింది. వర్షాల ప్రభావంపై వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను నుంచి వివరాలు సేకరిస్తున్నారు. నీట మునిగిన పంట పాడవ్వకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వాయుగుండ ప్రభావంతో జిల్లాలో సంతబొమ్మాళిలో అత్యధికంగా 16.25 మి.మీ వర్షం కురిసింది. కొత్తూరు మండలం నివగాంలో 16 మి.మీ, ఇచ్ఛాపురం మండలం బొడ్డపడలో 15.5 మి.మీ వర్షం కురిసింది. గార మండలం కళింగపట్నంలో 14.5 మి.మీ, కవిటి మండలం రాజపురంలో 12.5, కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో 10.75 మి.మీ వర్షం పడింది. ఎల్ఎన్‌పేటలో 10.5 మి.మీ, సోంపేట మండలం కొర్లాంలో పది మి.మీ వర్షం కురిసింది. ఎచ్చెర్లలో 9.75 మి.మీ, హిరమండలం గొట్టాబ్యారేజీ ప్రాంతంలో తొమ్మిది మి.మీ వర్షం కురిసింది. నరసన్నపేటలో 8.5 మి.మీ, మందస మండలం హరిపురం, లావేరు మండలం తామాడ, కంచిలి మండలం ఎంఎస్‌పల్లి చెరో 8 మి.మీ చొప్పున వర్షం పడింది. శ్రీకాకుళం నగరం, పోలాకి, బూర్జలో ఎనిమిదేసి మి.మీ చొప్పున వర్షం కురిసింది.

పెసర, మినప పంటలపైనా ప్రభావం

వరితో పెసర, మినుము పంటలపైనా వర్షాలు ప్రభావం చూపాయి. పంట పొలాల్లో భారీగా వర్షపు నీరు చేరింది. జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో పెసర, మినహా కలిపి సుమారు 20 వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. మరోవైపు మూడో రోజూ పలుచోట్ల వరి పంట నీటిలోనే ఉంది. ఇది కాక నూర్పులు కాక 1.45 లక్షల ఎకరాల వరకు కుప్పలుగా పోసిన పంటలోకి వర్షపు నీరు చేరింది.

వ్యవసాయ బృందాల పర్యటన

వర్షాల నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. వరి, పెసర, మినప పంట పొలాలను పరిశీలించారు. రైతుల నుంచి వివరాలను సేకరిస్తున్నారు. పొలాల నుంచి నీటిని మళ్లించేలా ఏర్పాట్లు చేసుకోవాలని రైతులకు సూచించారు. వీరితో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు నీట మునిగిన వరి పంట పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

నామమాత్రంగా ధాన్యం కొనుగోలు

జిల్లాలో శనివారం కురిసిన వర్షాలు ధాన్యం కొనుగోలుకు అడ్డంకిగా మారింది. వర్షాలు పడుతుండటంతో అటు ధాన్యం రవాణ, తరలింపునకూ ఇబ్బందిగా మారింది. దీంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు మందగించాయి. సాధారణంగా ఈ కాలంలో రోజుకు 10 వేల నుంచి 11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరుగుతుండేవి. వర్షాల ప్రభావంతో ఒక్కసారిగా ధాన్యం కొనుగోలు పడిపోయాయి. ఈ నెల 21న 3,362 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా శనివారం 1600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు.

నేడు తేలికపాటి జల్లులకు అవకాశం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంగా క్రమేణా బలహీనపడినట్లు వాతావరణశాఖ తెలిపింది. దీని ప్రభావంతో జిల్లాలో ఆదివారం అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది.

ఇబ్బందులకు గురిచేస్తున్నారనే...

హత్యకు కుట్ర

- బీహార్ గ్యాంగ్‌తో పాటు ఏడుగురు నిందితుల అరెస్టు
- పరారీలో మరికొందరు
- రెండు పిస్టల్స్, 46 బుల్లెట్లు, కారు, మూడు బైకులు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి





నిందితులను ప్రవేశపెట్టిన ఎస్‌పి మహేశ్వర రెడ్డి (ఇన్‌సెట్‌లో స్వాధీనం చేసుకున్న పిస్టల్స్)

ప్రజాశక్తి- పలాస

రాజకీయంగా, వ్యాపారపరంగా తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే టిడిపి పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజును హత్య చేసేందుకు చిన్నబాడంకు చెందిన ధర్మారావు తదితరులు కుట్ర పన్నారని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఏడుగురిని అరెస్టు చేయగా, మరో పది మంది పరారీలో ఉన్నారన్నారు. నిందితులు బీహార్‌కు చెందిన వారని అన్నారు. కాశీబుగ్గ స్టేషన్‌లో శనివారం నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నబాడాంలో టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత నాగరాజు పెత్తనం ఎక్కువ కావడం, ప్రతివిషయంలోనూ కలుగజేసుకునే వారని అన్నారు. దానిని సహించలేక ప్రత్యర్థులు అంపోలు శ్రీనివాసరావు, కూర్మాపు ధర్మారావు, కోత శ్రీనివాసరావు, హనుమంతు బాబూరావులు కలిసి నాగరాజును ఎలాగైనా హతమార్చాలని భావించారని అన్నారు. అక్టోబరు మెదటి వారంలో గ్రామానికి సమీపంలో ఉన్న పాత సినిమాహాల్ వెనుక మామిడి తోటలో రహస్య సమావేశం నిర్వహించారని తెలిపారు. హనుమంతు బాబూరావు, పొన్నాడ కృష్ణారావు, బీహార్‌కు చెందిన కిరాయి హంతక ముఠా వ్యక్తులను సంప్రదించారని అన్నారు. నవంబరు 10న విశాఖపట్నంలోని ఓ లాడ్జీలో బీహార్ ముఠాతో కలసి నాగరాజును హత్యచేసి, ఎటువంటి అనవాళ్లు లేకుండా చూసేందుకు రూ.10 లక్షలు సుపారీ ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. అందులో భాగంగా బీహార్ గ్యాంగ్‌కు రూ.2 లక్షలు ముందుస్తు అందించారని అన్నారు. ఈ నేపథ్యంలో నవంబరు 10 నుంచి బీహార్ గ్యాంగ్ ముఠా పలాసలో మకాం వేసి హత్యకు పతకం వేశారన్నారు. నాగరాజు ఇంటి వద్ద రెక్కీ నిర్వహించి వెళ్లిపోయారని తెలిపారు. హత్యలో భాగంగా ఈ నెల 20న సాయంత్రం చిన్నబాడాంకు చెందిన అంపోలు శ్రీనివాసరావు, మందస మండలం జిల్లుండకి చెందిన రౌతు చంద్రశేఖర్ అలియాస్ చందు, బిహార్‌కు గ్యాంగ్ ముఠా మహమ్మద్ ఇక్బాల్, మహమ్మద్ అమీర్లు అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, 9 ఎంఎం కంట్రీమేడ్ తుపాకీతో నాగరాజు ఇంటికి వంద మీటర్ల దూరంలో తమ పతకం రచన చేస్తుండగా... కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. అలాగే కోసంగిపురం కూడలి వద్ద ఓ ఇంట్లోని మరో ముగ్గురును అదుపులోనికి తీసుకున్నట్లు వివరించారు. ఈ కేసులో ఇంత వరకు ముగ్గురు బీహార్ హంతకుల ముఠా, పలాస నియోజకవర్గం పరిధిలో ఉన్న నలుగురిని అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో సంబంధం ఉన్న మరి కొంత మందికి విచారించనున్నామని తెలిపారు. వారిలో బీహార్‌కు చెందిన ఆరుగురు, స్థానికులు 11 మంది ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. నిందితులను పట్టుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. సమావేశంలో పలాస టెక్కలి, డిఎస్‌పిలు వి.వెంకట అప్పారావు, డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎస్.మూర్తి, ఎస్‌బి సిఐ ఇమ్మాన్యురాజు, సిఐలు దాడి మోహనరావు, కె.తిరుపతిరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ఉంటాం

ప్రభుత్వ విప్ అశోక్



తడిచిన చేలు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీటిపాలై అన్నదాత ఆవేదన చెందుతున్నాడని, ఇటువంటి కష్టకాలంలో అన్నదాతకు అండగా ఉంటామని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ హామీ ఇచ్చారు. ఈ మేరకు మండలంలో నీటమునిగిన వరిచేలను శనివారం పరిశీలించారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన ఎమ్మెల్యే అశోక్ ఓ రైతుబిడ్డలా పొలాలు కలియతిరిగారు. తడిచిన వరిచేలు చూసి చలించిపోయారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుకు అపార నష్టం సంభవించిందని, చూస్తే గుండె తరుక్కుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కోసిన పంట తడిచిపోవడమే కాకుండా ఉన్నపంట కూడా పూర్తిగా నీటిలో ఉందని, చివరికి పశువులకు గడ్డి సైతం కొరత ఏర్పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇప్పటికే పంట నష్టం అంచనా పక్కాగా చేపట్టాలని వ్యవసాయ అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతులకు డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతన్నలు కలత చెందవద్దని, రంగు మారిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తామని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి రైతాంగం సమస్యలు తీసుకెళ్లి వారికి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బెందాళం రమేష్, ఆరింగి మధు, ఆరింగి త్రివిక్రమరావు, బెందాలం తిరుమలరావు, తమరాల జయరాం, ప్రగడ మణిబాబు పాల్గొన్నారు.

ఎన్నికల క్లయిమ్స్‌పై సూపర్ చెక్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల క్లయిమ్స్‌పై సూపర్ చెక్ కార్యక్రమాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం నిర్వహించారు. ఎస్ఎస్ఆర్-2025 (స్పెషల్ సమ్మరీ రివిజన్) రూపకల్పనలో భాగంగా ఇప్పటి వరకూ వచ్చిన ఫారం 6, 7, 8 క్లయిమ్స్‌కు సంబంధించి డిస్పోజ్ అయి క్లయిమ్స్‌లో భారత ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన 23 దరఖాస్తులను సూపర్ చెక్ చేశారు. ఆయా క్లయిమ్స్ కింద అర్జీ పెట్టుకున్న వారి ఇంటి వద్దకు బిఎల్ఒలు వెళ్లారా? లేదా? ఓటరు అందించిన సరైన వివరాలనే బిఎల్ఒ పొందుపరిచారా? లేదా? తదితర అంశాలను పరిశీలించారు. ఆయా క్లైములకు సంబంధించి ర్యాండమ్‌గా జిల్లా కలెక్టర్, కలెక్టర్ కార్యాలయంలో సూపర్ చెక్ నిర్వహించిన కార్యక్రమంలో సీ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రతి గింజా కొనుగోలు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- టెక్కలి

ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించే చివరి గింజ వరకూ కొనుగోళ్లు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ధాన్యంలో తేమ శాతాన్ని 24 నుంచి 14 శాతానికి తగ్గించామని తెలిపారు. రైతు ఆనందమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో రిజర్వాయర్లలో 95 శాతం నీరు ఉండే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వంశాధార మెయిన్ కెనాల్ ద్వారా పలాస వరకు సాగునీరు అందుతుందని అన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రూ.16 వందల కోట్లు ధాన్యం బకాయిలు తీర్చామని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20 వేలు ఇవ్వనున్నామని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ రెండుకళ్లుగా పాలన సాగిస్తున్నామని చెప్పారు. సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టుకు అనుబంధంగా టూరిజం, పరిశ్రమలు తదితరమైనవి ఏర్పాటు చేయనున్నామని అన్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకూ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకం జనవరి 1న నుంచి అమలు చేస్తున్నామని చెప్పారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. భూ కబ్జాలకు పాల్పడితే ల్యాండ్ గ్రేడింగ్ చట్టం ద్వారా శిక్షిస్తామని అన్నారు. అంతకు ముందు నియోజకవర్గ అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గం పరిధిలోని నరిసింగపల్లి, లింగాలవలస, పాతమేఘవరం, జీడిపేట గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి, గ్రామీణ నీటి సరఫరా విభాగం, అధికారులు రామకృష్ణ, మోహనరావు, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయ్, రవికాంత్ కార్యదర్శి కె.వి.వి.జగన్నాథం, టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, మహిళా అధ్యక్షులు మెండ దమయంతి, హనుమంతు రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రాజెక్టు కమిటీలు ఏకగ్రీవం


వంశధార, నారాయణపురం ప్రాజెక్టు ఛైర్మన్లుగా రవీంద్ర, ఢిల్లీశ్వరరావు



నియామకపత్రాలను అందజేస్తున్న వెంకటరమణ, ఎస్ఇ స్వర్ణకుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రాజెక్టు కమిటీల ఎన్నికలు ఏకగ్రీవం కావడంతో జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రత్యర్థ వైసిపి పోటీలో లేక పోవడంతో ఇప్పటికే సాగునీటి సంఘాలన్నింటినీ కూటమి పార్టీలే దక్కించుకున్నాయి. చివరిగా శనివారం నీటిపారుదల శాఖతో పాటు వంశధార ప్రాజెక్టు పరిధిలోని రెండు ప్రాజెక్టు కమిటీల ఎన్నిక లాంఛనంగా పూర్తి చేశారు. నీటిపారుదల సర్కిల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రాజెక్టు కమిటీ ఎన్నికలను వంశధార ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజినీర్ స్వర్ణకుమార్ పర్యవేక్షించారు. ముందుగా డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికైన సభ్యులు ప్రాజెక్టు కమిటీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను ఎన్నుకునేందుకు వీలు కల్పించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, పిఎసిఎస్ మాజీ ఛైర్మన్ కింజరాపు హరివరప్రసాద్‌లు పాల్గొని సభ్యుల మధ్య ఏకాభిప్రాయాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. బిఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ఛైర్మన్‌గా నైరకు చెందిన అరవల రవీంద్రబాబు, వైస్ ఛైర్మన్‌గా ఎల్ఎన్‌పేట మండలానికి చెందిన ఒమ్మి ఆనందరావులను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. అలాగే టిపిఆర్ నారాయణపురం ఆనకట్ట ప్రాజెక్టు ఛైర్మన్‌గా సనపల ఢిల్లేశ్వరరావు, వైస్ ఛైర్మన్‌గా పొన్నాడకు చెందిన పంచిరెడ్డి కృష్ణారావులను ఎన్నుకున్నారు. ఈ పదవులకు వేరెవరు పోటీలో లేక పోవడంతో ఎన్నిక లాంఛనంగా ముగిసింది. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణమూర్తి, జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, బిర్లంగి ఉమామహేశ్వరరావు, నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్

మాతా శిశు మరణాల నియంత్రణకు కృషి

జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాతా, శిశు మరణాల నియంత్రణకు కృషి చేయాలని జెసి ఫర్మాన్ అహ్మద్ వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మాతా శిశు మరణాల నియంత్రణపై శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించారు. వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గృహ సందర్శనలతో పాటు రక్త హీనత, ఇతర ఆరోగ్య సమస్యలు గుర్తించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు పర్యవేక్షించాలన్నారు. ప్రమాద స్థితిలో ఉన్న వారిని గుర్తించి నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. ప్రసవ సమయాల్లో ఇంటివద్దే ఉంచి సమస్యలు కొని తెచ్చుకోకుండా సరైన సమయంలో దగ్గరలో ఉన్న ఆస్పత్రికి పంపించడం ద్వారా ప్రాణాలను సంరక్షించవచ్చన్నారు. రక్తహీనతపై తరచూ వైద్య పరీక్షలు చేయించడం, పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే తల్లితో పాటు బిడ్డ సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రసవాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే... చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎన్.కళ్యాణ్‌బాబు, డిపిహెచ్ఎన్ఒ శైలజ, ఐసిడిఎస్ పిఒ బి.శాంతిశ్రీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

జిఎస్‌టిఒగా పురుషోత్తంనాయుడు



వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి- పలాస

పలాస సర్కిల్ గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ ఆఫీసర్‌గా ఎపి ఎన్‌జిఒల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తంనాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పురుషోత్తంయుడు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మొట్టమొదటిసారిగా ఉద్యోగిలో చేరి మరలా ఇక్కడే జిఎస్‌టిఒగా ఉద్యోగోన్నతి పొంది విధుల్లోకి చేరడం ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్యలో సంధానకర్తలగా ఉంటూ ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలను, పథకాలను ప్రజలకు నేరుగా చేరే విధంగా చేసే బాధ్యత ఉద్యోగులపైన ఉందన్నారు. అనంతరం ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు. సాయిరాం, కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, కమర్షియల్ టాక్స్ అధికారులు బడియ కామరాజు, రాయి వేణుగోపాల్ టి. పరమేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, కేశవరరావు, పలాస ఎన్‌జిఒ అధ్యక్షులు బోనెల గోపాల్, బొంతల ఉపేంద్రరావు, పి.శ్రీనివాసరావు, ఎస్.ఉపేంద్ర, చాణిక్య, దుర్గాప్రసాద్ పట్నాయక్, గిరి, పాపారావు, ఉదయ శంకర్ పాత్రో, ఎస్‌టిఒ రామారావు, పి.శ్రీనివాసరావు, బొడ్డేపల్లి మోహనరావు, కె.రవికుమార్‌శర్మ మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

డిఎంహెచ్‌ఒగా బాలమురళీకృష్ణ

విశాఖ ఆర్‌టిసి ప్రిన్సిపాల్‌గా మీనాక్షి బదిలీ



బాలమురళీకృష్ణ



మీనాక్షి (బదిలీ)

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్ఒ)గా డాక్టర్ టి.వి.బాలమురళీకృష్ణ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురి డిఎంహెచ్ఒలను బదిలీ చేస్తూ శనివారం జిఒ నంబరు 781 విడుదల చేసింది. ఈయన కర్నూలు జిల్లా బడినేహల్ పిహెచ్‌సిలో వైద్యునిగా పనిచేస్తున్నారు. ఉద్యోగోన్నతిపై ఆయన జిల్లాకు వస్తున్నారు. ఇప్పటివరకు డిఎంహెచ్ఒగా పనిచేస్తున్న బొడ్డేపల్లి మినాక్షిని విశాఖపట్నంలోని పురుషుల రీజనల్ ట్రైనింగ్ సెంటర్ (ఆర్‌టిసి)కు ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసింది.

సర్వజనాస్పత్రి సిఎస్ఆర్ఎంఒ అనిత

ప్రభుత్వ సర్వజనాస్పత్రి సివిల్ సర్జన్ రెసిడెన్సియల్ మెడికల్ ఆఫీసర్ (సిఎస్ఆర్ఎంఒ)గా డాక్టర్ అనిత నియమితులయ్యారు. వైద్యాధికారుల ఉద్యోగోన్నతులు, సాధారణ బదిలీల్లో భాగంగా పలువుని బదిలీ చేస్తూ జిఒ నంబరు 782 విడుదల చేసింది. అందులో భాగంగా కాకినాడ ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సిఎస్ఆర్ఎంఒగా పనిచేస్తున్న డాక్టర్ అనితను ఖాళీగా శ్రీకాకుళం జిజిహెచ్‌కు బదిలీ చేశారు.

వ్యవసాయ మంత్రి జిల్లాలోనూ రైతులకు కడగండ్లే

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాను సస్యశ్యామలం చేస్తాం, ప్రతి ఎకరాకూ సాగు నీరందిస్తాం, రైతుల సంక్షేమమే మా ధ్యేయం అంటూ చెప్పే నాయకులు రైతులకు కష్టకాలం వచ్చేసరికి కనపడటం లేదు. జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నా వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కనీసం సమీక్షించడానికి తీరికలేకుండా పోయింది. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో ఈ నెల 20న క్యాంప్ కార్యాలయంలో వినతులు స్వీకరించడానికి సమయం కేటాయించిన అమాత్యులు వర్షాలతో జిల్లా ప్రజలు పడుతున్న ఇబ్బందులు, నష్టాలపై కనీసం సమీక్షించేందుకు సమయం వెచ్చించలేకపోయారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలు ఊపందుకుంటున్న తరుణంలో పడుతున్న వర్షాలు రైతులను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైతులు ధాన్యం అమ్ముకోలేక, నిల్వ చేసుకునే చోటు లేక అవస్థలు పడుతున్నారు. ధాన్యంలో 17 శాతం తేమశాతం దాటితే వాటిని అధికారులు తీసుకునే పరిస్థితి ఉండకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు రావడం లేదు. వర్షాలు పడుతుండటంతో అటు ధాన్యం రవాణ, తరలింపునకూ ఇబ్బందిగా మారింది. వర్షాలు తగ్గి ఎండలు కాస్తే గాని ఇళ్ల నుంచి ధాన్యం కదిలే పరిస్థితి కనిపించడం లేదు. ఖరీఫ్ ప్రారంభంలో వరుణుడి కరుణ కోసం ఎదురుచూసిన అన్నదాతలు ధాన్యం తడవకుండా మరోసారి వరుణుడి దయ కోసమే చూడాల్సిన పరిస్థితులు దాపురించాయి. మరోవైపు వర్షాలతో పలు చోట్ల వరి పంట నీట మునుగుతోంది. జిల్లాలో ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, మందస, సోంపేట, గార, లావేరు ప్రాంతాల్లో ఆలస్యంగా విత్తనాలు వేయడంతో ఇప్పుడు కోతలకు వచ్చాయి. మూడు రోజులుగా అడపదడపా వానలు పడుతుండటంతో రైతులు కోతలను వాయిదా వేశారు. వర్షానికి పంట నేలకొరిగిన పరిస్థితులు తలెత్తాయి. జిల్లాలో కోతలు కాకుండా ఉన్న వరి సుమారు 70 వేల ఎకరాల వరకు ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు. ఇది కాక నూర్పులు కాక 1.45 లక్షల ఎకరాల వరకు కుప్పలుగా పోసి ఉంచినట్లు చెప్తున్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందిస్తామని అధికారులు ప్రకటించినా... వాటిని తీసుకునేందుకు రైతులు ఇష్టపడం లేదు. టార్పాలిన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం ఒక్కోదానిపై రూ.650 డిపాజిట్ చేయాలని చెప్పడం, అవీ రైతు సేవా కేంద్రాల్లో కాకుండా తహశీల్దార్ కార్యాలయంలో ఉంచడంతో వాటిని తీసుకునేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. అన్ని ఇబ్బందులు పడేకంటే రోజుకు రూ.25 చెల్లించి ప్రయివేట్ వ్యక్తుల నుంచి అద్దెకు తీసుకువెళ్లడమే మేలైనదిగా భావిస్తున్నారు.

ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులను సాగు నీటి కష్టాలు వెంటాడుతునే ఉన్నాయి. జూలైలో పంట కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడిక తొలగింపు పనులు కొంత మేర చేపట్టినా ఫలితం కనిపించలేదు. పొట్ట, గింజ కట్టే దశకు చేరిన వరి పంటకు సాగు నీరందక రైతులు ఇబ్బందులు పడిన పరిస్థిని చూశాం. జిల్లాలో సాగునీటి సమస్యలను చర్చించేందుకు కనీసం ఒక్కసారీ సాగునీటి సలహా మండలి సమావేశాలు నిర్వహించిన పాపాన పోలేదు వంశధార కుడి, ఎడమ రెండు కాలువల్లో అడగడుగునా పెద్ద ఎత్తున గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోయింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి తర్వాత జూలైలో టెక్కలి, పలాస నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాల్లో హడావుడిగా జంగిల్ క్లియరెన్స్, పూడిక తొలగింపు పనులు చేపట్టినా అవేవీ సత్ఫలితాలను ఇవ్వకపోవడంతో ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల్లో లక్ష్యం కంటే తక్కువ విస్తీర్ణంలోనే వరి సాగైంది. ఇలా ఖరీఫ్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రైతులు ఇబ్బందులు పడుతునే ఉన్నారు. జిల్లాకు చెందిన సీనియర్ నేత వ్యవసాయ మంత్రి కావడంతో జిల్లాకు తగిన ప్రాధాన్యత దక్కుతుందని, తమ కష్టాలను అమాత్యునికే నేరుగా చెప్పుకోవచ్చని ఆశ పడ్డ రైతులకు నిరాశే మిగిలింది. జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా ఉన్న పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీరు కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులై మూడు నెలల కాలంలో జిల్లాలో ఒక్కసారి పర్యటించారు. అదీ పైడిభీమవరంలో పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమై వెళ్లిపోయారు. ఇప్పటి వరకు జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డిడిఆర్‌సి) సమావేశాన్ని నిర్వహించి జిల్లా స్థితిగతులను తెలుసుకునే ప్రయత్నమేదీ చేయలేదు. ఇన్‌ఛార్జి మంత్రులు ఆయా జిల్లాల్లో తరుచూ పర్యటిస్తుండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్తున్నా... ఇన్‌ఛార్జి మంత్రి శ్రీనివాస్‌కు జిల్లాకు రావడానికి ఎందుకో ప్రాధాన్యత ఇవ్వడం లేదు. బహుశా ఇవే కారణాలతో ఏమో ఇటీవల కేబినెట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తావించిన బాగా పనిచేసిన మంత్రుల జాబితాలో ఇరువురి మంత్రులు లేకపోయిండొచ్చని ప్రజలు అనుకుంటున్నారు. ఇకనైనా ఇరువురు మంత్రులు కార్యకర్తల బాగోగులతో పాటు, ఇతర పర్యటనలతో పాటు జిల్లా అభివృద్ధికి కాస్తా సమయం వెచ్చిస్తే బాగుంటుందనే అభిప్రాయం వినిపిస్తోంది.


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఐతమ్ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు వెన్నెముక

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తిచేసిన పూర్వపు విద్యార్థులు ఐతమ్ అభివృద్ధికి వెన్నెముకని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. 21వ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సమావేశం కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ స్థాయిల ఉద్యోగాల్లో స్థిరపడిన వారు ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పాటును అందించాలన్నారు. విద్యార్థుల విజయమే కళాశాల విజయమని చెప్పారు. 95 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాల్లో స్థిర పడుతున్నారని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అల్యూమినీ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.యుగంధర్, ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ ఎం.ఎస్.ఎస్.కుమార్, డీన్లు, హెచ్‌డిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.


పురస్కారాన్ని అందుకుంటున్న రాంబాబు

రాంబాబుకు సేవా పురస్కారం

బూర్జ: భారత రైల్వేలో విశిష్ట రైల్వే సేవా పురస్కారు అవార్డును విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలిపల్లి రాంబాబుకు లభించింది. ఈ సందర్భంగా శనివారం న్యూఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చేతులు మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. బూర్జ మండలం పెద్దపేట పంచాయతీ పరిధిలోని కొండ పేటకు చెందిన వావిలిపల్లి రాంబాబు ఈ అవార్డు పొందడం జిల్లాకే గర్వ కారంగా నిలిచారు. రాంబాబు 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో రవాణాలో రూ.5 వేల కోట్లు మార్కును అధిగమించి నందుకు ఈ పురస్కారం అందుకున్నారు. దీంతో గ్రామస్తులు రాంబాబుకు అభినందించారు. తల్లిదండ్రులు సాంబమూర్తి, పట్టా బమ్మలకు రాంబాబు రెండో సంతానం. రాంబాబు 2008లో హైదరాబాద్ మున్సి పల్ కార్యాలయంలో స్టినోగ్రాఫర్గా ఉద్యోగంలో చేరారు. అనంతరం సికింద్రాబాద్ నార్త్‌జోన్ రైల్వేలో సీనియర్ స్టెనో గ్రాఫర్‌గా విధుల్లో చేరారు. 2011 సివిల్ సర్వీసులో ఎంపికై విజయవాడ డివిజన్ రైల్వే జెన్‌లో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌గా బాధ్యతలను చేపట్టారు.

నాక్ గ్రేడ్‌కు పూర్వ విద్యార్థులు సహకరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గతంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ వివరాలను https:// gcmsklm.ac.in /almuni_register.php లింక్‌లో నమోదు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ తెలిపారు. నాక్ టీం సందర్శన అనంతరం గ్రేడ్ పొందే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ తమ వివరాలు ఇందులో నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 29న మధ్యాహ్నం 2 గంటలకు పూర్వ విద్యార్థుల సంఘ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి పూర్వ విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాల కోసం పూర్వ విద్యార్థుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రామకృష్ణ 9948121716, 9494944029 నెంబర్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.


బూర్జ : ముంపునకు గురైన అపరాల పంట

ముంచేసిన 'వాయుగుండం'

- నీట మునిగిన పంట పొలాలు
- అపరాల పంటకు అపార నష్టం
- లబోదిబోమంటున్న రైతాంగం

ప్రకృతి కన్నెర్ర చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రైతులకు పెను గండంగా మారింది. ఎన్నో ఆశలతో రబీకి సిద్ధమైన రైతుల ఆశలను వరుణుడు నిండా ముంచాడు.

ప్రజాశక్తి- బూర్జ

బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు నిండా మునిగిపోయి చెరువులను తలపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు అందక నష్టాలు చవి చూసిన రైతులు రబీ సీజన్‌పై గంపెడు ఆశలను పెట్టుకున్నారు. మండలంలోని వై.పర్త, డొంకలపర్త, పనుకుపర్త, అల్లెన, లక్కుపురం, పెద్దపేట, బూర్జ, లాభాం, నారాయణపురం, గుత్తావల్లి తదితర గ్రామాల్లో సుమారు 4500 ఎకరాల్లో అపరాల పంటలను పండించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా మినుము, పెసర, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట పూతదశలో ఉన్న మొక్కలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నీట మునిగిపోయాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంట పొలాలు నీటితో మునిగిపోవడంతో పెసర, మినుము, జొన్నపంటలు కుళ్లిపోయే పరిస్థితి దాపురించింది. ఆరుగాలం ఇంటిల్లిపాది కష్టపడి పండించిన పంటలు కుళ్లిపోయే పరిస్థితి ఉండడంతో తీవ్ర నష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా వాయుగుండం తమను నిండా ముంచిందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

నిండా ముంచింది



అకాల వర్షం నిండా ముంచి ంది. రబీపై ఎన్నో ఆశలు పెట్టు కున్నాం. ఆశలన్నీ ఆడియాసలు అయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

- శాసపు రాము, రైతు, బూర్జ

చర్యలు చేపడతాం



వర్షంతో నీట మునిగిన పంట పొలాలను పరిలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. సోమవారం నాటికి పొలాల్లో నీరు నిల్వ లేకపోతే పంటలకు నష్టం ఉండదు. రైతులు ఆందోళన చెందవద్దు.

- ఎన్.శ్రీనివాసరావు, మండల ఎఒ, బూర్జ

ఆశలు ఆవిరి

కవిటి: రైతన్నల ఆశలు ఆవిరయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీట మునిగింది. కోసిన పంటతో పాటు కుప్పలు పెట్టిన పంట, నూర్చిన ధాన్యం తడిచి ముద్దయ్యాయి. వెరసి కర్షకుని కంట కన్నీటిని తెప్పించాయి. మండలంలోని 2,662 ఎకరాల్లో వరి సాగు చేస్తే దాంట్లో సగానికి పైగా నీటిపాలైంది. ప్రస్తుతం మండలంలో 550 ఎకరాల్లో కోత అవ్వకపోగా, మరో 530 ఎకరాల పంట వరికుప్పల రూపంలో ఉంది. 90 ఎకరాలు కోసిన పంట నీటిలో ఉంది. మొత్తంగా సుమారు 17 గ్రామాల రైతులు అల్పపీడన ప్రభావంతో ఆరుగాలం పండించిన పంటను కోల్పోయిన పరిస్థితి ఏర్పడింది.


బల్లిపుట్టుగలో నేలకొరిగిన వరి పంట


లావేరు : సుభద్రాపురంలో నీటమునిగిన వరి కుప్పలు

తడిచిన వరిపంట

లావేరు: అల్పపీడనం కారణంగా మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలో వరి పంటలు తడిచిపోవడంతో రైతులు లబోదిబో మంటున్నారు. మండలంలోని సుభద్రాపురం జాతీయ రహదారి అనుకొని ఉన్న పొలంలో వర్షానికి కోసిన వరి పంట దిబ్బలు పెట్టడానికి వీలు కాకపోవడంతో నాలుగురోజులు వర్షానికి తడిచిపోగా కుప్పలు పెట్టిన పంట కూడా వరద నీటితో పూర్తిగా తడిచిపోయింది. దీంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.

తెలంగాణ ఎమ్మెల్యే విరాళం

ప్రజాశక్తి- సోంపేట

తెలంగాణ రాష్ట్రానికి చెందిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే కె. వివేకానంద సోంపేట మండలం మామిడిపల్లిలో తొలితరం కమ్యూనిస్టు, స్వాతంత్ర సమరయోధుడు, రైతాంగ ఉద్యమ నేత గానుగుల తరుణాచారి విజ్ఞాన కేంద్రానికి రూ.ఐదు లక్షలు భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు విజ్ఞాన కేంద్రం గౌరవాధ్యక్షులు పాతిన కృష్ణమూర్తి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ విరాళాన్ని ప్రకటించి ఈ ప్రాంత ప్రజలపై, ఉద్దానం ప్రజల పోరాట స్ఫూర్తిపై అభిమానంతో తన దాతృత్వాన్ని నిరూపించు కున్నారని అన్నారు. ఆయనకు ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారన్నారు. హైదరాబాద్‌లో నివాసమంటూ మామిడ పల్లికి చెందిన పాతిన నరేంద్రవర్మ, ఎన్‌టివి జర్నలిస్టు దుమ్ము నేతాజీ, తిమ్మల రమేష్ నేతృత్వంలో ఎమ్మెల్యేతో చర్చించి విజ్ఞాన్ కేంద్రానికి విరాళం పొందడానికి విశేషమైన కృషి చేశారని తెలిపారు. ఎమ్మెల్యే వివేకానందకు విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు జుత్తు సింహాచలం, గోరకల మన్మథరావు, తెప్పల పాపారావు, పాతిన ముకుందరావు, తాళపత్ర రామారావు, కర్రి సింహాచలం ధన్యవాదాలు తెలిపారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి


రణస్థలం రూరల్ : రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ప్రభుత్వం ద్వారా రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథరావు, రాగోలు శాస్త్రవేత్త ఉదయబాబు అన్నారు. మండలంలోని కమ్మసిగడం, కొండములగాం, వేల్పురాయి పంచాయతీలో అల్పపీడనం వలన కురిసిన వర్షాలు కారణంగా కోత కోసిన, కుప్పలు, వరి పంట వ్యవసాయ క్షేత్రాలను శనివారం సందర్శించారు. కోత కోసి పనలపై ఉన్న వరిపై కళ్లు ఉప్పు ఎకరాకి 25 కేజీలు చల్లుకోవాలని, గింజలు మొలకెత్తకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణం (లీటర్ నీటికి 50 గ్రాములు) పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనే విధంగా, రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకుంటా మన్నారు. ఈయనతో వ్యవసాయాధికారి డి.విజయ్ భాస్కర్, రైతు సేవా కేంద్రం అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రబీలో సాగుచేస్తున్న పెసర, మినప, వేరుశెనగ పంటలలో వర్షాపు నీరు నిల్వ లేకుండా రైతులు చూసుకోవాలని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.వి. తిరుమలరావు అన్నారు. స్థానిక ఎఒ గోవిందరావుతో కలిసి మండలంలోని శ్రీజగన్నాథపురం రెవెన్యూ పరిధిలోని పెసర, మినుము, వేరుశెనగ పంట పొలాలను వ్యవసాయశాఖ సిబ్బంది ఆమదాలవలసకు చెందిన కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.భాగ్యలక్ష్మి, చిట్టిబాబు పాల్గొన్నారు.

దుండగుల హల్‌చల్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్ పరిసరాల్లో హోల్‌సేల్ వ్యాపారం సాగిస్తున్న వ్యాపారవేత్త కోరాడ గోవింద్ ఇంట్లోకి శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి హల్‌చల్ సృష్టించారు. కత్తులతో ప్రవేశించి ముగ్గురు దుండగలు ఇంట్లో ఉండే వారిని భయభ్రాంతులకి గురిచేశారు. సమయంలో ఇంట్లో ఉన్న గోవింద్ సోదరుడు కుమారుడు గట్టిగా కేకలు వేస్తూ... వారికి ఎదురు నిలవడంతో వారంతా పరారయ్యారు. కిన్నెర థియేటర్ జంక్షన్ సమీపంలో కాకివీది ప్రధాన మార్గంలోనే కోరాడ గోవింద్ ఇల్లు ఉంది. సత్యం రద్దీగానే ఆ ప్రాంతం. ఇరుగుపొరుగున షాపులు ఉన్నాయి. రద్దీగా ఉండే సమయంలోనే గోవింద్ ఇంట్లోకి ముందు ద్వారం గుండా ఇద్దరు, వెనుక వైపు నుంచి ఒక్కరు ప్రవేశించి కత్తులు చూపించారు. ఇంట్లో మహిళలు, గోవింద్ సోదరుడు కుమారుడు వారితో మాట్లాడుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో ప్రవేశించడంతో ఇంట్లో ఉండే వస్తువులను పట్టుకుని గట్టిగా కేకలు వేస్తూ ఆ యువకుడు వారిని ప్రతి ఘటించేందుకు ప్రయత్నం చేశారు. కేకలు విన్న బయట వ్యక్తులు రావడంతో దుండగలు పరారయ్యారు. పోలీసులకు సమాచారం రావడంతో సిఐ పైడపు నాయుడు ఘటనాస్థలానికి చేరుకుని ఆరా తీశారు.


గాయపడిన క్షతగాత్రుడు

నలుగురికి గాయాలు

పాతపట్నం: మండలంలోని కొరసవాడ సమీపంలో జాతీయ రహదారి వద్ద శనివారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కుమారుడు సాయిగణేష్ డ్రైవర్ రాజేష్ కారు ఆటోను ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. శ్రీకాకుళం నుంచి పాతపట్నం వస్తున్న కారు, పాతపట్నం నుంచి కొరసవాడ వెళ్తున్న ఆటోను ఢీకొంది. కారు డ్రైవర్ అదుపు తప్పి టేకు తోటల్లోకి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి క్షతగాత్రులను స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. ఎస్ఐ బి.లావణ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఎమ్మెల్యే గోవిందరావు వైద్య సిబ్బందికి ఆదేశించారు.

ప్రసాద్‌రెడ్డికి అభినందనలు

టెక్కలి రూరల్ : టిడిపి నాయకులు దల్లి ప్రసాద్ రెడ్డి సోషల్ మీడియా విభాగంలో ఉత్సాహంగా పోస్టులను పెట్టారు. ఈ మేరకు ఆయనకు అభినందిస్తూ మంగళ గిరి టిడిపి కేంద్ర కార్యాలయం నుంచి ప్రశంసాపత్రాన్ని పంపించారు. ఈ మేరకు శనివారం టెక్కలిలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతులు మీదుగా ప్రశంసాపత్రాన్ని అందించారు. ప్రసాద్‌రెడ్డిని పలువురు అభినందించారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్ వల్లే సాధ్యం


నరసన్నపేట : దుప్పట్లను పంపిణీ చేస్తున్న కృష్ణదాస్


కొత్తూరు : దుప్పట్లను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- నరసన్నపేట

ఏకకాలంలోనే సంక్షేమాన్ని, అభివృద్ధిని ఏకతాటి నడిపించి.. రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి మాజీ సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కృషి చేశారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో జగన్ పుట్టిన రోజు వేడుకలు సందర్భంగా శనివారం కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా మాటాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని ఆరోపించారు. ఆరు నెలల కాలంలోనే ప్రజలకు కూటమి ప్రభుత్వ దగా పాలన అర్థమైందని విమర్శించారు. కూటమి అబద్దపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈసారి కార్యకర్తలకు మరింత ప్రాధాన్యత ఇస్తామన్నారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలో లొద్దపుట్టు వద్ద ప్రజా ప్రస్తావన విజయా స్థూపం వద్ద, అలాగే పట్టణంలో స్వేచ్ఛావతి ఆలయంలో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మిలు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, వైస్ చైర్‌పర్సన్లు భారతీ దివ్య, స్వర్ణమణి, ఎంపిపి కడియాల పద్మ, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, నర్తు నరేంద్ర యాదవ్, టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్ పట్నాయక్, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్ రెడ్డి, కవిటి మండల పార్టీ అధ్యక్షులు కడియాల ప్రకాష్ పాల్గొన్నారు. అలాగే ఈదుపురంలో ఎపిపి ఫెడరేషన్ స్టేట్ కో-ఆర్డినేటర్ ప్రత్తి అన్వేష్ కేక్ కట్ చేశారు. పేదలకు, రోగులకు రొట్టెలు, పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫాస్టర్ బిమో బెహరా, ఏలీయా, పీసా దాసు, ప్రకాష్, చిట్టిబాబు, పురుషోతం, సుగుణ దేవరాజ్, కె.మోహనరావు, నర్తు ప్రేమ్, లోహి దాస్‌రెడ్డి, కాళ్ల సత్యం పాల్గొన్నారు.

కొత్తూరు : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద జన్మదిన వేడుకలను నిర్వహించారు. ముందుగా కేకును కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. అనంతరం పేదలకు, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుప్పట్లు, పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, తోట నందకుమార్, కలమట రమేష్‌నాయుడు, చింతాడ సూర్యనారాయణ, పి.సాధుబాబు, గండివలస ఆనందరావు, సేపేన అశోక్‌కుమార్, ఎన్.బాలకృష్ణ, వి.లక్ష్మీనారాయణ, ఎల్.తిరుపతిరావు, వై.దాసునాయుడు, కె.వైకుంఠరావు, గార రాజులనాయుడు, జి.ప్రసాదరావు, ఎన్.కృష్ణ పాల్గొన్నారు. అలాగే వైసిపి కార్యాలయంలో రూపు తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు మామిడి శ్రీకాంత్ పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో గోగుల వరప్రసాదరావు నాయుడు, పి.రామారావు నాయుడు, ఎడ్ల గోవిందరావు పాల్గొన్నారు. ఇలా వేర్వేరుగా జన్మదిన వేడుకలు నిర్వహించడంతో పలువురు చర్చించుకుంటున్నారు.

పాతపట్నం : స్థానిక నీలమణి దుర్గ ఆలయం ప్రాంగణంలో మాజీ సిఎం జగన్ పుట్టిన రోజును పురస్కరించి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రదీప్, సర్పంచ్‌లు బెనియా వెంకటరమణ, సర్పంచ్ ప్రతినిధులు ఏనుగుతల సూర్యం, పనుకు మోహన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై తనకున్న అభిమానాన్ని మండలంలోని వరకకు చెందిన వైసిపి నాయకులు శ్రీకాంత్ పురియా నిలువెత్తు రూపంలో చూపించారు. జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని సుమారు 50 అడుగులకు మించిన కటౌట్ గ్రామంలో ఏర్పాటు చేశారు.

మందస : స్థానిక ప్రగతి భవనంలో మాజీ సిఎం జగన్ పుట్టిన వేడుకలను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కరి దానయ్య, పలాస ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, వజ్రపుకొఊత్తురు ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, వజ్రపుకొత్తూరు జెడ్‌పిటిసి ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, బోర బుజ్జి, మండల పార్టీ అధ్యక్షులు పైల వెంకటరావు పాల్గొన్నారు.

సోంపేట : మాజీ సిఎం జగన్ జన్మదినం పురస్కరించుకొని సోంపేటలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ సత్యనారాయణ స్వామి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి తడక యశోద, ఎంపిపి ఎన్.దాసు, బి.మోహనరావు, ఎస్.భాస్కరరావు, బి.శ్రీకృష్ణ, ఎం.వెంకటరమణ, ఎం.శివాజీ, కె.శ్రీనివాస్, బి.సంతోష్, జె.ఉదయ్, ఎస్.కిరణ్ పాల్గొన్నారు.

కంచిలి : మాజీ సిఎం జగన్ జన్మదినం పురస్కరించుకొని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మండపల్లి వద్ద ఉన్న సీతయ్య ఫౌండేషన్‌లో వృద్ధులకు, అనాథలకు భోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నరేంద్ర యాదవ్, టి.వివేకానందరెడ్డి, ఎస్.దేవరాజు, డి.అజయ్, బి.లక్ష్మీనారాయణ, జై.కామేశ్వరరావు, కె.లక్ష్మీనారాయణ, జి.మోహన్, జి.రమేష్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ఎస్ఎల్ కళ్యాణ మండపంలో జగన్ జన్మదిన సందర్భంగా వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ కేక్ కట్ చేశారు. అలాగే రక్తదాన శిబిరం, అన్నదానం కార్యక్రమం చేపట్టారు. వసతిగృహ విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, ఎంపిపిలు ఆట్ల సరోజనమ్మ, నడుపూరి శ్రీరామ్మూర్తి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కవిటి: జగన్ జన్మదిన సందర్భంగా కవిటిలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. చింతామణి ఆలయ ప్రాంగణంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ రామారావు, ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య పాల్గొన్నారు.

మెళియాపుట్టి : జగన్ జన్మదినం సందర్భంగా స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, వైస్ ఎంపిపి ప్రతినిధి పాడి అప్పారావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, కరణం శశిభూషణరావు, ఎంపిటిసి ప్రతినిధి ఉర్లాన రుషి, కిరణ్ పాల్గొన్నారు. అలాగే నందవలో వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు, సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు కేక్ కట్ చేశారు.

పలాస కాశీబుగ్గ ప్రగతి భవన్‌లో జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కేక్ కట్ చేసి నాయకులు కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపిపి ఉంగ ప్రవీణ, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు పైల వెంకటరావుచిట్టి, పాలిన శ్రీనివాసరావు, దువ్వాడ మధుకేశ్వరరావు పాల్గొన్నారు. టెక్కలిపట్నంలో ఎంపిపి ఉంగ ప్రవీణ కేక్ కట్ చేశారు.

టెక్కలి రూరల్ : ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి ఆధ్వర్యాన జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా అక్కువరంలో రక్తదాన శిబిరం, అన్నదానం నిర్వహించారు. వసతిగృహ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ చేశారు.

ఆమదాలవలస : మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన ఆదర్శనీయమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం ఫ్లైఓవర్ దిగున ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల కేక్‌ను అభిమానుల మధ్య కట్ చేసి పంచిపెట్టారు. పట్టణ శివారులో ఉన్న లెప్పర్స్ కాలనీలోని పేదలకు దుప్పట్లు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వైసిపి హయాంలో పేదలకు సంక్షేమం, అభివృద్ధితో కూడిన పరిపాలనను జగన్మోహన్ రెడ్డి అందించారన్నారు. పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజల్లో సుస్థిర స్థానాన్ని జగన్మోహన్ రెడ్డి సంపాదించుకున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, సరుబుజ్జిలి జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, బూర్జ మండల పార్టీ అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, మాజి పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి ప్రభాకరరావు, దుంపల శ్యామ్, బొడ్డేపల్లి పద్మజ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు: మండల కేంద్రంలో మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ కళింగ కార్పొరేషన్ చైర్మన్, కళింగ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుంపల లక్ష్మణరావు (రామారావు) ఆధ్వర్యంలో కేకు కట్ చేసి పేదలకు పళ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్, జెడ్‌పిటిసిలు లోలుగు కాంతారావు, బి.గోవిందరావు, ఎంపిపిలు కిల్లి వెంకట సత్యనారాయణ, తమ్మినేని శ్రీరామమూర్తి, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాడాన సునీల్, గాడు నాగరాజు, నాయకులు పప్పల రాధాకృష్ణ, కిల్లాన సూర్యారావు, వండాన సూరపునాయుడు, అనకాపల్లి గోవిందరావు పాల్గొన్నారు.


ఆమదాలవలస : దుప్పట్లు, పళ్లను పంపిణీ చేస్తున్న రవికుమార్



ఇచ్ఛాపురం : కేకు కట్ చేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ

కేశవరాయపురంలో తాగునీటి ఇక్కట్లు

వారం రోజులుగా గ్రామస్తుల అవస్థలు

ప్రజాశక్తి- లావేరు


లావేరు పంచాయతీ కేశవరాయపురంలో గత వారం రోజులుగా గ్రామస్తులు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. గ్రామంలో ఉన్న డైరెక్ట్ పంపింగ్ మోటార్ మరమ్మతులకు గురవ్వడంతో బోరులో నుంచి మోటార్ తీసి మరమ్మతులకు తీసుకువెళ్లారు. వారం రోజులు గడుస్తున్నా ఇప్పటికీ మోటార్ బిగించకపోవడంతో గ్రామంలో ప్రజలకు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులకు తాగునీరు, వాడుక నీరుకు ఈ బోరే ఆధారం. వారం రోజులుగా గ్రామస్తులు వ్యవసాయ పంపుసెట్లు వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో వ్యవసాయ బోర్లు వేయకపోవడంతో తాగునీరుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని లావేరు మాజీ ఉప సర్పంచ్ ఉప్పాడ గొల్ల ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గ్రామంలో మోటార్ ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


బోరు నుంచి మోటారు తీసేయడంతో ఖాళీగా ఉన్న బోరు (ఇన్‌సెట్‌లో నీరురాని కుళాయిలు)

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మహిళల కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని టెక్కలి అడిషనల్ జడ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్ రిసోర్స్ సభ్యులు వి.హరిప్రియ, పి.సౌజన్యతో మహిళల హక్కులు, వారి కోసం రూపొందించిన చట్టాలపై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు.కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, యాసిడ్ దాడులు, వరకట్న వేధింపులు, లైంగిక దాడులు, గృహ హింస, పనిచేసే చోట లైంగిక వేధింపులు, మహిళల అపహరణ, మానవ అక్రమ రవాణాపై అవగాహన చేసుకోవాలన్నారు., కార్యక్రమంలో తహశీల్దార్ బి.పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, ఎఎస్ఐ బి.అప్పన్న, వెలుగు ఎపిఎం త్రినాథమ్మ, సచివాలయ పోలీసులు, డ్వాక్రా సిఎఫ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ జడ్జి శ్రీనివాసరావు

అధ్వానంగా రహదారి

- వాహనదారులకు తప్పని పాట్లు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- లావేరు

మండలం బొంతుపేట కూడలి జాతీయ రహదారి నుంచి గుమ్మడాం మీదుగా రణస్థలం మండలం రావాడ కూడలికి చేరుకొనే రహదారి బొంతుపేట నుంచి గుమ్మడాం గెడ్డవరకు రహదారి పెద్ద గుంతలతో వర్షపు నీటితో చిన్నపాటి కొలనును తలపించేలా ఉండడంతో ప్రయాణికులు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ఆ గుంతల్లో పడటంతో గాయల పాలవుతున్నారు. ఆటోల్లో ప్రయాణించే వారు కుదుపులతో ఆటో బోల్తా పడిపోతుందోమోనని భయాందోళనకు గురవుతున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, 108 వాహనాలు చేరుకోవడానికి కష్టతరంగా మారింది. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ రహదారి సమస్యను తీసుకెళ్లిన పట్టించుకోలేదని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టి రహదారి సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.


బొంతుపేట, రావాడ రోడ్డులో ఉన్న గుంతలు



యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

యోగాతో మానసికోల్లాసం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యోగాతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యాన వరల్డ్ మెడిటేషన్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ యోగాతో మానసిక, శారీరక ఒత్తిళ్లను జయించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించ వచ్చన్నారు. ప్రతిరోజు 20 నిమిషాలు యోగ సాధనకు కేటాయిస్తే ఒత్తిడి లేని సమాజాన్ని నిర్మించు కోవచ్చన్నారు. నేటి జీవన విధానంలో నిత్యం అధిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నామని, తద్వారా అనారోగ్య సమస్యలు ఉత్పన్న మవుతున్నాయన్నారు. అటువంటి తరుణంలో యోగా చక్కని పరిష్కారమన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాద్, డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు, గీతా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు అందజేస్తున్న మోహనరావు

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో చలి తీవ్రత పెరగడం వల్ల నిరాశ్రయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారిలో వృద్ధులు, చిన్న పిల్లలు, ఆస్తమా వంటి వ్యాధిగ్రస్థులు కూడా ఉన్నారని తెలుసుకుని అరసవల్లికి చెందిన ఇంజరాపు మోహనరావు దుప్పట్లను పంపిణీ చేశారు. శనివారం వారి నివాస ప్రాంతాలకు వెళ్లిన ఆయన దుప్పట్లు అందజేశారు. ఆరుబయట చలికి వణకుతూ అనారోగ్య సమస్యలు తెచ్చుకోవద్దని వారికి సూచించారు. నిరాశ్రయులు బస్‌స్టేషన్, దేవాలయాల వద్ద, ప్రభుత్వ ఆస్పత్రి, మండపాల వద్ద తలదాచుకుంటున్నారని, వారిని సురక్షితమైన కేంద్రానికి చేర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలన్నారు. అనంతరం వారికి భోజనాలు అందజేశారు. కార్యక్రమంలో నవతరం నవచైతన్య, బత్తిలి రమేష్, జీల్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ జాడ సాయి, నంది ఉమా శంకర్, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి ప్రతినిధి పొడుగు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు పథకం ఎప్పుడు?

ఇచ్ఛాపురం : ఎన్నికల్లో హామీలో భాగంగా మహిళలకు ఫ్రీ బస్సు పథకం ఎప్పుడు అమలు చేస్తారని కాంగ్రెస్ యూట్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మహిళలకు ఫ్రీ బస్ పథకం అమలుపై కూటమి ప్రభుత్వానికి కాలయాపన చేయడం సరికాదన్నారు. అధికా రంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా మంత్రివర్గంలో చర్చించకపోవడం సరికాదన్నారు. ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంలో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఈ పథకం అమలు చేసిందన్నారు.

తూతూమంత్రంగా జంగిల్ క్లియరెన్స్

కోటబొమ్మాళి: మండలం హరిశ్చంద్రపురంతో పాటు పలు గ్రామాలకు చెందిన ఆర్అండ్‌బి రోడ్లుకు సుమారు రూ. 80 లక్షలతో జంగిల్ క్లియరెన్సు చేయాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా పనుల్లో జాప్యం చేస్తూ కాలం వెల్లబుచ్చారు. తాజాగా హరిశ్చంద్రపురం జాతీయ రహదారి నుంచి పనులు ప్రారంభించి తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. ప్రొక్లెన్ సహాయంతో ఈ పనులు నిర్వహించి మమా అనిపిస్తున్నారు. రోడ్డు పక్కన పూర్తి స్థాయిలో జంగిల్ క్లియర్ చేయకుండానే పనులు చేస్తున్నారు. జంగిల్ క్లియర్ చేసిన తరువాత కూడా పిచ్చి మొక్కలు రోడ్డుకు ఇరువైపుల కనిపిస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు పనులపై దృష్టి సారించి పూర్తి స్థాయిలో జంగిల్ క్లియరెన్సు చేయాలని పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



జంగిల్ క్లియరెన్స్ చేసిన తరువాత రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలు

గణితశాస్త్ర పితామహుడు రామానుజన్



టెక్కలి : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురష్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని ఏటా జరుపుకుంటున్నామని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు అన్నారు. శనివారం కళాశాలలో శ్రీనివాస్ రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో గణితం భాగమని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శంకరనారాయణ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, ఐక్యూఎసి పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆదిలక్ష్మి, గణిత విభాగం అధ్యాపకులు వై. ప్రశాంతి, యు. కీర్తిక, కె.నాగచంద్రిక తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట : నరసన్నపేటలో శర్వాణి విద్యాలయంలో గణిత వేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ సాయిరాణి, ప్రిన్సిపాల్ బి.వి.రమణమూర్తి రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం విద్యార్థులతో రూపొందించబడిన గణిత నమూనాలు ట్రైప్స్ ఆఫ్ ఏంగిల్స్, గణిత కేలండర్ ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు శ్రీనివాస్, మణి పాల్గొన్నారు.

'జ్ఞాన భారతి'లో...

పట్టణంలోని జ్ఞాన జ్యోతి పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. విద్యార్థులకు గణితంలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం గణిత ఉపాధ్యాయులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ సభ్యులు వెలమల భాస్కరరావు, బోర రామారావు, తర్ర సత్యనారాయణ, పాగోటి లక్ష్మి, పి.మదు, ఎం.రాజేష్, టి.పుష్పలత, టి.మదు, కె.లక్ష్మి, పి.కళ్యాణి, ఎం.సుధారాణి, బి.భవాని పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలో కొలిగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణతి ఉపాధ్యాయులు జ్యోతి, రేణుక, చంద్రవతిలకు హెచ్‌ఎం ఎం.నరేంద్రనాథ్ పట్నాయక్ దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, పద్మావతి, పాడి అమిత్ మినూచంద్ర, స్వప్నరాణి, పీతాంబర పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో నిర్వహించిన గణిత దినోత్సవ వేడుకల్లో ఎంఇఒలు ధనుంజయ మజ్జి, చిట్టిబాబు, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టాలెంట్ టెస్టులో విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ఎంఇఒలు ధనుంజయ్ మజ్జి, చిట్టిబాబులను సన్మానించారు. కార్యక్రమంలో బివికె ప్రిన్సిపాల్ ఎం.అనిల్, ఆంగ్ల పాఠశాల ప్రిన్సిపాల్ బిందు మాధవి, ఎఒ రాణి పాల్గొన్నారు.

మందస : మండలంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎస్.గణేశ్వరరావు ఆధ్వర్యాన గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణితపై క్విజ్ పోటీలు నిర్వహించి అందులో విజేతలకు బహుమతులను అందజేశారు. అలాగే గణతి ఉపాధ్యాయులు గవ్వ భీమారావును సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యు.లక్ష్మణరావు, ఎస్.కిరణ్‌కుమార్, ఎస్.అబ్రహం, పి.రాంబాబు, ఎం.చిత్రసేను పాల్గొన్నారు.

టెక్కలి : ప్రతి మనిషీ నిత్య జీవితంలో గణితం కీలకపాత్ర పోషిస్తుందని ఆమ్మఒడి పాఠశాల కరస్పాడెంట్ బరాటం శ్రీనివాసరావు అన్నారు. గణిత దినోత్సవం సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.దామోదరరావు, పుష్పలత, బాలాజీ, రాజు, లక్ష్మి పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, వి.లూక్‌పాల్, ఎస్.లక్ష్మణరావు, రమేష్, రాంబాబు, రమణమూర్తి పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న అధ్యాపకులు



మాట్లాడుతున్న తహశీల్దార్ జోగారావు

కొత్తకుంకాంలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి- లావేరు

రైతులకు ఉన్న వివిధ రకాల భూ సమస్యలు రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని తహశీల్దార్ ఎన్ని జోగారావు అన్నారు. శనివారం కొత్తకుంకాంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్నవారు సదస్సుల్లో ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కునపల్లి దామోదరరావు, మండల సర్వేయర్ బళ్లాడ శ్రీధర్ రెడ్డి, ఆర్ఐ రాపర్తి అప్పలరాజు, రైతులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు కోసం చేపడుతున్న డిమాండ్ సర్వేను విజయవంతం చేయాలని సోషల్ డెవలమెంట్‌ట్ మొబిలైజర్ చెన్నూరి మల్లేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా వజ్రపుకొత్తూరులో శనివారం విలేకరులతో మాట్లాడారు. సొంత స్థలం ఉండి ప్రభుత్వ సహకారంతో ఇళ్లు కట్టుకోవాలనుకే వారికి ప్రధానమంత్రి అవాస్ యోజన పథకం ద్వారా ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ పథకం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయని తెలిపారు. ఈ నెలాఖరు వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సచివాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. దరఖాస్తుతో పాటు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, తరగతి, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జత చేయాలని కోరారు.

వినియోగదారులను మోసగిస్తే జైలుశిక్ష

ప్రజాశక్తి- ఆమదాలవలస

వస్తువుల సేవలో గాని వాటి సామర్థ్యం, నాణ్యత, ధరలో ఏ వ్యాపారైనా వినియోగదారుడిని మోసగిస్తే జైలు శిక్ష తప్పదని సీనియర్ జర్నలిస్టు, న్యాయవాది మండల వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు టి.ధనుంజయరావు అన్నారు. శనివారం జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వినియోగదారుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 1986లో ఏర్పాటైన వినియోగ దారుల రక్షణ చట్టం 2019లో సవరణ చేసి వినియోగదారులకు మరింత రక్షణ కల్పిస్తూ, కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. వ్యాపారులు వినియోగదారుల ప్రాణాలతో చెలగాట మాడితే ఈ చట్టం జరీమానా, జైలు శిక్షలు విధిగా విధిస్తుందన్నారు. ఎవరైనా వ్యాపారులు మోసపూరిత ప్రకటనలు చేస్తే ఆరు నెలలు జైలు, రూ.20 లక్షల వరకు జరీమానాలు విధిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కామర్స్ వినియోగదారులకు ఈ చట్టం మరింత భద్రతను ఇస్తుందన్నారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై నిర్వహించిన వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, ఫోరం సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ధనుంజయరావు

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.3580 కోట్ల బకాయిలు తక్షణమే ప్రభుత్వం చెల్లించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని రామలక్ష్మణ కూడలి వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సిహెచ్ రవికుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలుగా పూర్తయినా స్కాలర్ షిప్‌లు, విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంటు చెల్లించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల యజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి చేస్తూ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి యాజమాన్యాలకు లికిత పూర్వకంగా ఆదేశాలున్నా వాటిని పట్టించుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తక్షణమే బకాయిలు చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. ఉన్నత విద్యారంగానికి నష్ట దాయకంగా మారుతున్న జిఒ నెంబర్ 77పై కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదని, దీనివల్ల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు పూర్ణ, రాజు, ప్రవీణ్, రమేష్ కుమార్, శ్రీను, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

కొత్తూరు : పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాణ అంబేద్కర్‌పై చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు బొడ్డేపల్లి కృష్ణారావు డిమాండ్ చేశారు. మండలంలోని పాపాపురంలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోని, జాతికి క్షమాపణలు చెప్పాలని, వెంటనే కేంద్ర కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ... శనివారం నిరసన తెలిపారు. అమిత్ షా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జి.రామారావు, కల్లేపల్లి ఆనందరావు, కింజరాపు శ్రీనివాసరావు, కింజరాపు సింహాచలం, యాళ్ల సుందరరావు, కొర్ర రవి, జయరాజ్, వజ్రగడ్డ కృష్ణారావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

లావేరు: మండల సచివాలయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఉద్యోగులు శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా బలివాడ రాజశేఖర్, ఉపాధ్యక్షునిగా తాలాడ లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా కెళ్ల జగన్‌ను ఎన్నుకున్నారు. వీరితో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ధర్మరావు, కోశాధికారిగా టి.గౌరీశంకర్, జాయింట్ సెక్రటరీగా లకినాన యమునా రాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వై. తేజేశ్వరరావు, వై. జోగారావు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ మండల సచివాలయ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటం చేస్తామ న్నారు. అనంతరం నూతన సచివాలయం ఉద్యోగుల మండల కార్యవర్గాన్ని ఎంపిడిఒ పి.వెంకట రాజు, ఇఒపి ఆర్‌డి విశ్వేశ్వరరావు, అధికారులు అభినందించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

శ్రీకాకుళం అర్బన్ : పెద్దపాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాలలో సెమీ క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఉపాధ్యాయులు ఐశ్వర్య, భవాని, లక్ష్మి, ఆధ్వర్యాన ఈ వేడుకలు జరిగాయి. ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎస్ రంగమణి కేకు కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. చిన్నారులు డ్యాన్సులు, పాటలు, అలరించాయి. కార్యక్రమంలో హారతి, ఉమా కుమారి, మౌలేశ్వరి, ధనలక్ష్మి, హైమావతి, జయశ్రీ, పుష్పవేణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రవికుమార్ పరామర్శ

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఇటీవల జాతీయ రహదారిపై కోటబొమ్మాళి మండలం పాకివలస వద్ద రహదారి ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు సంపదరావు త్రివేణి కుటుంబాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శనివారం పురపాలక సంఘంలోని ఒకటవ వార్డు తిమ్మాపురంలోని ఆమె స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రమాదం జరిగిన తీరు కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరపున కుటుంబానికి అన్నివిధాల అండగా ఉండి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆయన వెంట టిడిపి మాజీ కౌన్సిలర్ సంపదరావు మురళి, కిల్లి అమ్మి నాయుడు, పవన్ తదితరులు పాల్గొన్నారు.



త్రివేణి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

'కాకినాడ ఆదిత్య'లో ధ్యాన దినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన శనివారం అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ మెంటారు నటుకుల మోహన్, యోగా గురువు కల్పన, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్ హాజరై మాట్లాడారు. యోగా వల్ల విద్యార్థుల్లో ఒత్తిడి లేని చదువులు సాధ్యమవుతాయన్నారు. మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంచుకునేందుకు యోగ సాధన ఎంతో ప్రయోజన కరమన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దన్నారు. కార్యక్రమంలో ఎం. నాగభూషణం, డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ జిజివి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అనంతరం లయన్స్ మెంటారు మోహన్‌ను సత్కరించారు.

'జ్ఞాన భారతి'లో...

ఇచ్ఛాపురం: మానసిక ప్రశాంతతకు, అద్భుతమైన జీవన విధానానికి ధ్యానం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్టు సిఇఒ, కార్యదర్శి జోహార్ ఖాన్ అన్నారు. అంతర్జాతీయ ధ్యాన దినోత్సవ సందర్భంగా జ్ఞాన భారతి సిబిఎస్ఇ సీనియర్ సెకండరీ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యారుథలు ధాన్యం చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : సత్కరిస్తున్న కాకినాడ ఆదిత్య ప్రతినిధులు